

## ప్రశాంతంగా డీఎడ్ 4వ సెమిస్టర్ పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న గోవిందునాయక్

**అనంతపురం సిటీ :** ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారం జరిగిన డీఎడ్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అనంతపురం పట్టణంలో కస్తూరిబా నగరపాలిక బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 66 మందికి గాను 62 మంది హాజరయ్యారని చెప్పారు. సత్యసాయి జిల్లా బుక్కపట్నం డీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లో 160 మంది విద్యార్థులకు గాను 154 మంది హాజరు అయినట్లు తెలిపారు. రెండు జిల్లాల్లో కలిపి 10 మంది గైర్హాజరు అయ్యారన్నారు.



మంత్రి పెద్దిరెడ్డికి సమస్యలను విన్నవిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

# కల్తీ విత్తనాలతో నష్టం

**◆ బాధిత రైతులకు పరిహారం ఇవ్వండి ◆ మంత్రి పెద్దిరెడ్డికి సిపిఎం వినతి**

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో కల్తీ, నాసిరకం పత్తి విత్తనాలతో రైతులు పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వం దీనిని గుర్తించి బాధిత రైతులకు పూర్తి స్థాయి పరిహారం అందజేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురంలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో 70 వేల హెక్టార్లలో పత్తిపంటను సాగు చేశారని తెలిపారు. వరుసగా వేరుశనగ పంట నష్టపోవడం, పంట నష్టపరిహారంలో వేరుశనగ పంటకు పరిహారం ఇవ్వకపోవడం, పత్తి పంటకు గిట్టుబాటు ధర రావడం తదితర కారణాలతో ఈ ఏడాది జిల్లాలో ఎక్కువ మంది రైతులు పత్తి పంటను సాగు చేశారని వివరించారు. దీన్ని అవకాశంగా తీసుకుని పత్తి విత్తన కంపెనీలు నాసిరకం, నకిలీ విత్తనాలను పెద్ద ఎత్తున రైతులకు విక్రయించారన్నారు. విత్తనకొరత సృష్టించి తెలంగాణ రాష్ట్రం నుంచి తెప్పించి అదనపు ధరకు విక్రయించారన్నారు. విత్తన నాణ్యత లేకపోవడం వల్ల పామిడి, పెద్దవడుగూరు, తాడిపత్రి, యాడికి, మండలాల్లో వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు నష్టపోయారని తెలిపారు. తాడిపత్రి మండలం ఎగువపల్లి, బందర్లపల్లి, బాపణపల్లి, తిమ్మేపల్లి, కోనగుట్టపల్లి, తిమ్మాపురం, తేరన్నపల్లి, పెద్దపడమల గ్రామాల్లో దాదాపు 4 వేల ఎకరాలకుపైగా పత్తి పంట నష్టం జరిగిందన్నారు. ఈ గ్రామాల్లో దిశా, తులసి, అఖిర, అంకుర, ఎటిఎం, లక్ష్మీగోల్డ్, నవ్య, యుఎస్ కంపెనీ విత్తనాలను రైతులు కొనుగోలు చేశారన్నారు. వీటిని జిల్లాతో పాటు పొరుగున్న ఉన్న ఆదోని ప్రాంతాల్లోని ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు అమ్మకాలు చేశారని తెలిపారు.ఇవి నాసిరకం, నకిలీ విత్తనాలు కావడంతో పంట మొత్తం నష్టపోయవాల్సి వచ్చిందన్నారు. ఎకరాకు ఒక క్వింటా కూడా పత్తి దిగుబడి రాలేదన్నారు. నకిలీ, కల్తీ విత్తనాలు సరఫరా చేసి రైతులను దగా చేసిన అఖిర, తడాఖ తదితర కంపెనీలపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని కంపెనీలు రైతులను దోపిడీ చేస్తూ నష్టపరుస్తున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం, ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఇదివరకే కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వివరించారు. జిల్లాలో కౌలు రైతులకు పంటరుణాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య పాల్గొన్నారు.

# నకిలీ ఓట్లను తొలగించండి

## పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న పోతుల నాగరాజు


**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

2023లో జరుగు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నకిలీ ఓట్లు నమోదు చేసుకున్న వారిని తొలగించాలని పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి అర్జీను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, అనంతపురం, కర్నూలు నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్ల నమోదులో నకిలీలను చేర్చినట్లు తెలుస్తోందన్నారు. అధికార పార్టీ నాయకులు వాలంటీర్‌లను ఓటు నమోదు కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. డిగ్రీ పూర్తి చేయని వారిని నకిలీ సర్టిఫికెట్లతో ఓటర్లుగా నమోదు చేశారన్నారు. ఇలాంటి వాటిని తాము కొన్నింటిని గుర్తించామన్నారు. జిల్లా అధికారులు నకిలీ ఓట్లను గుర్తించి వాటికి కారణం అయిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నకిలీ ఓట్లను లొలగిస్తామని, ఇందుకు వాలంటీర్లు సహకరించి ఉంటే వారిని తొలగిస్తామని తెలియజేశారు.

## వర్షంతో దెబ్బతిన్న పంటల పరిశీలన

**బొమ్మనహాల్ :** అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని దేవగిరి గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న ఓ రైతుకు చెందిన నాలుగు ఎకరాల చెరకు తోటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలవ విలేకరులతో మాట్లాడుతూ.. అకాల వర్షాలకు పత్తి, వరి, మిరప, వేరుశనగ, చెరకు, దానిమన్మ, చీనీ పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మంచి వర్షాలు వచ్చి పంట బాగా పండిందని రైతులు ఆశపడ్డారన్నారు. అకాల వర్షాలు రైతులు గుండెల్లో మంటను మిగిల్చాయన్నారు. అప్పుల ఊబిలో అల్లాడుతున్న రైతులకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కళ్లు తెరిచి క్షేత్రస్థాయిలో పంట నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షులు మల్లికార్జున, ఎల్బీనగర్ ధనుంజయ, మోహన్, వెంకటేశులు, సైకిల్ షాప్ హనుమంతు, సంగప్ప, నవీన్, రైతులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్‌లో ధన్యశ్రీ సత్తా



**అనంతపురం :** ఏలూరులో ఆదివారం జరిగిన ఏడవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లా సౌత్ జోన్ స్విమ్మింగ్ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన ఈత క్రీడాకారిణి బి.ధన్యశ్రీ రెండు రజత, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుంది. 100 మీటర్లు బ్లాక్ స్ట్రోక్ విభాగంలో రజత పతకం, 200 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ విభాగంలో (3:48:71 సెకండ్స్) రజత పతకం, 1500 మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగంలో (29:55:82 సెకండ్స్) కాంస్య పతకం, 100 మీటర్లు బట్టర్ ఫ్లై విభాగంలో (1:52:35) కాంస్య పతకం సాధించారు. అనంతపురం జిల్లాకు నాలుగు పతకాలను సాధించిన ధన్యశ్రీని జిల్లా ఈత సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామని రవిశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌లు అభినందించారు.

# అనధికారిక 'ఓపెన్‌రీచ్'

**◆ అధికారుల కళ్లేదుటే ఇసుక అక్రమ తవ్వకాలు**

**◆ 'సెబ్' సైతం సైలెంట్**



అనుమతుల్లేకుండా ఏర్పాట్లు చేసిన ఇసుక డంపింగ్



**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

'ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలుంటాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనలుంటున్నాయి. ఈ ప్రకటనలేవి అధికార పార్టీ నేతలకు వర్తించడం లేదు. సాక్షాత్తు తహాశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు కూతవేటు దూరంలో పోలీసు స్టేషన్ ఎదుటే అనుమతుల్లేకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. అనధికారిక 'ఇసుక రీచ్' తలపించే విధంగా పెన్నా నదిలోకి రోడ్డు వేసి, ఇసుక డంపింగ్‌లు ఏర్పాటు చేసి, రెండు ఎక్స్‌వేటర్లు ఏర్పాటు చేసుకుని ఇసుక తరలిస్తున్నా సైలెంట్‌గా వీక్షించడం తప్ప చర్యలు తీసుకుంటున్న దాఖలాలేవి కనిపించకపోవడం గమనార్హం. తాడిపత్రి నియోజకవర్గం పరిధిలోని పెద్దపప్పూరు మండల కేంద్రంలో తహాశీల్దారు కార్యాలయం ఎదుటే ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది.

**రోజుకు వందల ట్రిప్పులు తరలింపు**

డంపింగ్ యార్డులాగా ఎంపిడిఒ, తహాశీల్దార్ కార్యాలయాల ఎదుటే ఏర్పాటు చేసుకుని రెండు ఎక్స్‌వేటర్ల ద్వారా ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపుతున్నారు. రోజుకు సగుటన వందకుపైగా వాహనాలు ఇక్కడి నుంచి తరలి వెలుతున్నాయి. ఇంత జరుగుతున్నా అక్కడున్న అధికారులెవరూ కన్నెత్తి కూడా కార్యాలయం బయట జరుగుతున్న వ్యవహారాన్ని చూడకపోవడం గమనార్హం. ఈ రకంగా రోజుకు రూ.10 లక్షల వరకు లావాదేవీలు అందరి ముందే 'ఓపెన్' అక్రమ దందా సాగుతోంది. ఈ వ్యవహారంపై అధికారులను అడిగితే ఒక్కోరు ఒక్కో రకమైన సమాధానం చెప్పడం గమనార్హం.

**సెబ్ సైలెంట్**

అనుమతుల్లేని ఈ అక్రమ ఇసుక రీచ్‌లో లోడింగ్ వస్తున్న వాహనాలకు అనధికారులే బిల్లులు కూడా ఇస్తుండటం గమనార్హం. ఈ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు ఎవరి ఖాతాల్లోకి చేరుతున్నాయన్నది అందరికీ తెలిసిన రహస్యంగానే సాగుతోంది. ఇసుక, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'సెబ్' వ్యవస్థ కూడా కనుచూపు మేరలో కనిపించడం లేదు. వారు ఎక్కడా ఇటువంటి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా లేవు.

**ఆనుమతుల్లేవు**

పెద్దపప్పూరు వద్ద ఇసుక రీచ్‌కు సంబంధించి ఎటువంటి అనుమతుల్లేవు. అక్కడ తవ్వకాలేవి జరగడం లేదు. లోడింగ్‌లు అవటం లేదు. ఒకవేళ ఏదైనా జరుగుతూ ఉంటే తమ అధికారులను పంపించి చర్యలు తీసుకుంటాం.

**నాగయ్య, భూగర్భ గనుల శాఖ ఎడి.**

**అనుమతులొచ్చాయో లేదో...తెలీదు... :**

ఇక్కడ ఇసుక రీచ్ తవ్వకాల కోసం గతంలో తాము, భూగర్భ గనుల శాఖ అధికారల సంయుక్త తనిఖీలు చేశాం. తవ్వకాలు జరపాలనుకున్న ప్రాంతం సర్వే నెంబర్లు చెప్పడమే తమ పని.. ఆ తరువాత అనుమతుల అంశం భూగర్భ గనుల శాఖ చూసుకుంటుంది. ఇప్పుడు అక్కడ జరుగుతున్న తవ్వకాలకు సంబంధించి అనుమతులొచ్చాయో... లేదో తమకు తెలీదు. ఆ సమాచారమివ్వని కోరాం. వారి నుంచి తమకు ఎటువంటి సమాధానం రాలేదు. అది రాకుండా తామేమీ చేయలేం.

**షర్మిల, తహాశీల్దారు, పెద్దపప్పూరు.**

# త్వరితగతిన ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ

## కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

యుద్ధప్రాతిపదికన రెండు రోజుల్లోగా వాలంటీర్ల చేత ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ పూర్తి చేయించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో వివిధ అంశాలపై కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌లు జిల్లాలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రెండు గంటలకోసారి ఈకేవైసీ పురోగతిని పర్యవేక్షించాలన్నారు. పింఛన్ల పంపిణీ నెల ప్రారంభంలోనే పూర్తి అయినందున అందుబాటులో ఉన్న బయోమెట్రిక్ డివైజులను పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. ఈకేవైసీ కోసం అక్కడక్కడా కనిపిస్తున్న సాంకేతిక ఇబ్బందులను తొలగిస్తామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న వైద్యాధికారుల కోసం వెల్‌నెస్ సెంటర్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇతర ప్రభుత్వ భవనాలను నెలాఖరులోగా రూఫ్ లెవెల్ కు తీసుకురావాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న వేళల్లో ప్రతి గర్భిణులు భోజనం చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ భాగ్యరాజ్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డీపీవో ప్రభాకర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎహసాన్ బాషా, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

**అర్జీలకు త్వరితగతిన పరిష్కారం : కలెక్టర్**

స్పందన అర్జీలకు ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, డిఆర్ఒ గాయత్రి దేవి, ఇన్‌ఛార్జి ఆర్డీవో సుధారాణి, అస్సెట్ సిఇఒ కేశవనాయుడు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు 280 అర్జీలను అందించారు. అనంతరం కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారంపై ఆశించినంత పురోగతి కనబడటం లేదన్నారు. జిల్లా అధికారులు సైతం దీనిపై ప్రత్యేక దష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. రానున్న వారం రోజుల్లోపు అర్జీల పరిష్కారంలో పూర్తిగా మార్పు రావాలన్నారు. పదేపదే తప్పులు పునరావతం అయితే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

# కార్యకర్తల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తాం

**విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**ప్రజాశక్తి -అనంతపురం**

కార్యకర్తలకు ఇప్పటిదాకా ఏమీ చేయలేకపోయాం..ఈ ఒకటిన్నర ఏడాదిలో వారి ఆశయాలకు అనుగుణంగా ముందు కెళతామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ అవసానదశలో ఉందన్నారు. కానీ ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని ప్రజల్లో అపోహలు సష్టిస్తున్నారని మండిపడ్డారు. అనంతపురం జిల్లాలో క్షేత్రస్థాయిలో వైసీపీ పటిష్టంగా ఉంటే.. టిడిపి మాత్రం వైసీపీ రెండు స్థానాల్లో మాత్రమే బాగుందని ఉత్తుత్తి ప్రచారం చేసుకుంటోందని అన్నారు. నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న విద్యుత్ కళాభారతిలో అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడి ఆధ్వర్యంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షతన సోమవారం అనంతపురం నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజులుగా తాను జిల్లాలో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నానన్నారు. ఎక్కడా సీఎం జగన్‌పై ప్రేమ తగ్గలేదని గుర్తించానని చెప్పారు. దేశంలో ఇప్పటి వరకు ఎంతో మంది ముఖ్యమంత్రులు అయ్యారని, జగన్‌లా పరిపాలన ఎవరూ చేయలేదన్నారు. మూడున్నరేళ్లలోనే ఏకంగా 98.44 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌దని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రతిపక్ష పార్టీలు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్లు కరోనాతో సరిపోయిందని, ఆ సమయంలో కూడా సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపలేదని చెప్పారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన అపద్దపు హామీలను నమ్మి ప్రజలు టీడీపీని గెలిపించారని తెలిపారు. 600 హామీలు.. 100 పేజీల మేనిఫెస్టోను ప్రకటించిన చంద్రబాబు, చివరకు మేనిఫెస్టో కనిపించకుండా చేశారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు చెబితే ఆరోగ్యశ్రీ గుర్తుకు వస్తుందని, జగన్ పేరు చెబితే నవరత్నాలు గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబు తన పాలనలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కష్టపడి పని చేసిన కార్యకర్తలకు న్యాయం జరిగిందని, ప్రతి ఎన్నికల్లోనూ బీసీలను అడ్డుపెట్టుకుని టిడిపి అధికారంలోకి వచ్చిందని, ఆ వర్గాలకు చంద్రబాబు చేసిన మేలు ఏదీ లేదన్నారు. రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. అనంతపురం నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని, సీఎం జగన్‌ను ప్రతి ఒక్కరూ ఆదరించి..ఆశీర్వదించాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ..అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 50 కార్పొరేటర్ల పదవులు మినహా వేరే పదవులు ఇచ్చే అవకాశం లేదని, రాబోవు రోజుల్లో వీలైనన్ని ఛైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులు కేటాయించాలని మంత్రి పెద్దిరెడ్డిని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

# అధ్యాపకులను భర్తీ చేయలేరా..?

## ప్రభుత్వ తీరుపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఓ వైపు విద్యా విధానంపై గొప్పలు మాట్లాడుతూ మరో వైపు యూనివర్సిటీల్లో అధ్యాపకులను భర్తీ చేయలేని స్థితిలో ప్రభుత్వాలు ఉండడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్కెయులో సోమవారం ఉదయం ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో పెద్ద యూనివర్సిటీగా గొప్పలు చెప్పుకునే విశ్వవిద్యాలయంలోనే పలు విభాగాలకు అధ్యాపకులు లేకపోవడం విచాకరం అన్నారు. దశాబ్దాల కాలంగా వందలాదిమంది విద్యార్థులను ఉన్నతమైన స్థానాలకి పంపిన ఘనత ఎస్కెయుకు ఉందన్నారు. అలాంటి యూనివర్సిటీలో అధ్యాపకులు లేని పరిస్థితికి ప్రభుత్వాలు తేవడం సిగ్గుచేటన్నారు. ఖాళీ అయిన అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా అతిథి అధ్యాపకులతో విద్యను బోధించడం ద్వారా విద్యార్థులు చదువులో పూర్తి స్థాయి లక్ష్యాలను చేరుకోవడంలో అవరోధాలు ఎదురవుతున్నాయన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు అన్నింట్లోనూ ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తాం అని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలు పూర్తయినా ఒక్క అధ్యాపక పోస్టు భర్తీ చేసిన దాఖాలు లేవన్నారు. అధ్యాపకులు లేరన్న సాకుతో యూనివర్సిటీల్లో వివిధ గ్రూపులను మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలను మానుకుని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్కెయు హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు గిరిబాబు, నాయకులు సిద్ధార్థ, బాలాజీ, అనిల్ పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయి కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

**కలెక్టర్‌కు విన్నవించిన సిఐటియు నాయకులు ఓబులు**

**అనంతపురం కలెక్టరేట్:** శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు బకాయి ఉన్న రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీసత్యసాయి కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం బోర్డు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు రెండు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇంతవరకు ఇవ్వలేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లిస్తామని కాంట్రాక్టర్ 6 నెలలు పాటు చెల్లించే నిబంధన టెండరులో పెట్టామని అధికారులు తెలిపారన్నారు. వేతనాలు నెల నెలా రాకపోవడంతో 572 మంది కార్మికుల కుటుంబాలు పస్తులతో పని చేయాల్సి వచ్చిందన్నారు. హామీలిచ్చి 28 రోజులు కావస్తున్నా ఇంతవరకు సమ్మె డిమాండ్స్ అమలు కాలేదన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, మగ్బుల్‌బాషా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సజ్జలకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తేనీటి విందు

**అనంతపురం :** ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన తేనీటి విందుకు హాజరయ్యారు. సజ్జలకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో పాటు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ బోర్డు మెంబర్ నయనతారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డి తోపుదుర్తి సోదరులతో చర్చించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



## క్రీడాకారులకు అభినందన

**రాప్తాడు :** భారతదేశ కీర్తి ప్రతిష్టలను నలుమూలల విస్తరించేలా విజయంతో తిరిగి రావాలని సాఫ్ట్‌బాల్ ఇండియా కార్యదర్శి ఎల్ఆర్ మౌర్య పేర్కొన్నారు. ఈ నెల 14 నుండి 17వ తేదీ వరకు థాయిలాండ్‌లో జరిగే ఉమెన్ ఏషియన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు వెళుతున్న భారతదేశ ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు రాప్తాడు మండల పరిధిలోని ఆర్డీటి క్రీడా మైదానం నందు క్రీడా దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తి ప్రతిష్టలు ఆసియా దేశాలకు తెలియ చెప్పాలని, బంగారు పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. టీంకు కోచ్‌గా సాఫ్ట్‌బాల్ సీఈవో వెంకటేశులు నియమితులయ్యారు.

## వాలంటీర్ల నిరసన ప్రదర్శన

**రాయదుర్గం :** వాలంటీర్ల వ్యవస్థపై దుష్ప్రచారం తగదంటూ రాయదుర్గం పట్టణంలో వార్డు వాలంటీర్లు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. వాలంటీర్ల వ్యవస్థపై ఓ పత్రికలో వచ్చిన కథనంపై వినాయక కూడలిలో పత్రిక ప్రదర్శన చేస్తూ ప్రతులను కాల్చివేసి నిరసన తెలిపారు. తాము ప్రభుత్వ ప్రజా సేవకులం అని తమ సేవలను కించపరిచేలా వార్తలు రాయడం సరికాదన్నారు.







# కౌలు రైతులను ఆదుకోవాలని ధర్నా

**ప్రజాశక్తి-ఉరవకొండ**

అకాల వర్షాలతో పంటలు సాగు చేసి నష్టపోతున్న కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పేర్కొన్నారు. విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామం ఒకటవ సచివాలయం ఎదుట కౌలు రైతుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి మాట్లాడుతూ ఒక్క పాల్తూరు గ్రామంలోని దాదాపు 1000 మంది కౌలు రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం కార్డులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తూ కౌలు రైతులకు నష్టం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు అధికారుల నిర్లక్ష్యంతో కౌలు రైతులకు అందడం లేదన్నారు. కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు వెంటనే మంజూరు చేయాలని, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని, రైతు భరోసా కేంద్రాలలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కౌలు రైతులను, కలిసొచ్చే సంఘాలను కలుపుకొని తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు రుద్రేశ్, రవిప్రకాష్, హుస్సేన్ పీరా, నాగరాజు, సుంకన్న, రాముడు, ఎర్రిస్వామి, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కౌలు రైతులు

## నల్ల బ్యాడ్జీలు ధరించి విఆర్ఒల నిరసన


బొమ్మనహాల్‌లో వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఒలు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

పనికి తగ్గ వేతనం అందడంలేదని వీఆర్‌వోల సంఘం అధ్యక్షులు తిమ్మప్ప ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సకాలంలో వేతనాలు అందకపోవడంతో పాటు టీఏ, డీఏ, పీఎఫ్ తదితర నగదు ఉద్యోగుల ఖాతాల్లో జమకావడంలేదని అసహనం వ్యక్తం చేశారు. పనిభారం తగ్గించి వేతనాలు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు ఓబుళపతి, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**బొమ్మనహాల్ :** వీఆర్వోలు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బాడ్జిలు ధరించి తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహశీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వీఆర్వోల యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షులు పర్వీన్‌భాను, గోపాల్, రామన్న, వన్నూరుస్వామి, నరసింహమూర్తి, జాయింట్ సెక్రటరీ యుగంధర్, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** వీఆర్వోలు తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు మల్లేష్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటనారాయణ, అంకన్న, శ్రీనివాసులు, నరసింహులు, నరేంద్ర, పెద్దన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ల బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తాం

### అనంతపురం ఇన్‌ఛార్జి డీఈవో వెంకటకృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఇఒ

**ప్రజాశక్తి-అనంతపురం సిటీ**

ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామని అనంతపురం ఇన్‌ఛార్జి డీఈవో వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం బదిలీల పైన ఆయన తన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయుల బదిలీలను నిర్వహిస్తామన్నారు. క్లియర్ వేకెన్సీ, ఐదేళ్లు/ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న టీచర్లను బదిలీ చేస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల 13వ తేది అనంతపురం జిల్లా సైన్స్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలతో సమావేశం నిర్వహిస్తున్నమన్నారు. ఖాళీలను సేకరించి, దరఖాస్తుల పరిశీలన కోసం కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సందేహాలను నివృత్తి చేయడానికి కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా, షెడ్యూల్ ప్రకారం బదిలీల నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని వినతి

**బొమ్మనహాల్ :** బొమ్మనహాల్ మండలం గుంతకల్లు గ్రామంలో నిరుపేదలైన దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని తహశీల్దారు శ్రీనివాసులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకరమ్మ, అంబేద్కర్ సంఘం నాయకులు ఉలిగప్ప, శంకర్, దళిత మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

### ఎంవిఐ ఎన్‌వి.రాజాబాబు

**ప్రజాశక్తి-గుంతకల్లు**

యువత వాహనాలు నడుపుతున్న సమయంలో రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా గమ్యాలకు చేరుకుంటారని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వి.రాజాబాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కళాశాల కరస్పాండెంట్ జి.ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వి రాజాబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. తల్లిదండ్రులు పిల్లల కోర్కెలను తీర్చే క్రమంలో పోటీపడి పెద్ద వాహనాలు కొనిపెడుతూ గారాబం చేస్తున్నారన్నారు. ఐతే వాహనాలు నడిపే వయస్సు అర్హత, సామర్థ్యం లేనప్పటికీ వారిని ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. వేగం ప్రాణాలను హరిస్తుందని కుటుంబానికి తీరనిలోటు అవుతుందన్నారు. యువత వాహనాలతో రోడ్ల మీద వేగం తగ్గించి చదువులో వేగం పెంచాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచంలో చదువులకు ఆటంకంగా మారిన సినిమాలు, ఫేస్ బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంబదూర్ షేక్ నబీ రసూల్, ప్రిన్సిపల్ సృజనా మయూరి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, నాయకులు వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంవిఐ రాజాబాబు

# 15న గ్రామస్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సాకే నాగరాజు



కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-గుంతకల్లు**

గ్రామ స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15వ తేది జిల్లా కేంద్రంలోని డిపిఒ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు కార్మికలోకం తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సాకే నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ధర్నా ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గ్రామ స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. కార్మికులకు 10 నెలలుగా వేతన బకాయిలు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజూ గ్రామాలను శుభ్రంచేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్మికులు నాగన్న, ఖాసీం, ఆంజనేయులు, కదిరప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

**రాప్తాడు :** గ్రామాల పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న గ్రామ పంచాయితీ, స్వచ్ఛభారత్ కార్మికులను పాలకులు మనుషులుగా గుర్తించడంలేదని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు పేర్కొన్నారు. రాప్తాడు మండలంలోని రాప్తాడు పరసన్నాయపల్లి, చిన్మయనగర్, సచివాలయాల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 15న డిపిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోతలయ్య, ముత్యాలమ్మ, లక్ష్మీదేవి, చంద్రకళ, కదిరప్ప, సునీత, మధు, పెన్నయ్య, లక్ష్మీనరసమ్మ, నారాయణ, ఆదెప్ప, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఫోన్‌కాల్‌తో రోడ్డు మరమ్మతులు

### ప్రజాసేవే లక్ష్యంగా జనసేన శ్రమదానం

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ వినూత్న ఆలోచనతో పార్టీ శ్రేణులను మమేకం చేస్తూ.. క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఉంటూ.. ప్రజా సేవే లక్ష్యంగా శ్రమదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒక్క ఫోన్ (9398854513) కాల్ చేస్తే చాలు 24 గంటల్లోపు గుంతలు పడ్డ రహదారులకు మరమ్మతులు చేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందించారు. సోమవారం స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని పార్టీ కార్యాలయంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య ఆ పార్టీ శ్రేణులు ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టాలన్న సంకల్పంతో జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ నగరంలో గుంతలపడ్డ రహదారులను మరమ్మతులు చేయించేందుకు సంకల్పించారన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలోని 50 డివిజన్లో ఎక్కడైనా సరే రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతూ ఫోన్ కాల్ చేస్తే 24 గంటల వ్యవధిలో మరమతలు చేస్తామన్నారు. ప్రజల ఇబ్బందులు పట్టని వైసిపి పాలనను ప్రజలు తిరస్కరించాలని.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల అభ్యున్నతి కోసం అఖిలషించే జనసేన పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు జెక్కిరెడ్డి ఆదినారాయణ, గ్రంధి దివాకర్, జిల్లా కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, పురుషోత్తం రెడ్డి, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, రొల్ల భాస్కర్, చోటు, హుస్సేన్, దరాజ్ భాషా, నగర కార్యదర్శిలు విశ్వనాథ్, మురళి, ఆకుల ప్రసాద్, నెట్టిగంటి హరీష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

## డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టండి

**ప్రజాశక్తి-రాయదుర్గం**

రాష్ట్రంలో అక్రమంగా సాగుతున్న గంజాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టి, యువత భవిష్యత్తును కాపాడాలని రాయదుర్గం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కురుబ రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ సుమన్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు టిడిపి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వాల్మీకి ఆశోక్, కనేకల్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు బాయినేని నవీన్, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి సత్తి, జయరామి రెడ్డి, ముజ్జు, జలందర్ రెడ్డి, మారుతీ, అనుమేష్, కిరణ్, జానకిరాముడు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యశాల తనిఖీ

**పుట్లూరు :** పుట్లూరు మండల కేంద్రంలోని పశువైద్యశాలను అనంతపురం డివిజనల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఒక్క బిల్ కూడా పడని మినీ గోకులాలకు డిపాజిట్ అమౌంట్ తిరిగి ఇప్పిస్తామని చెప్పారు. ఈ తనిఖీలో యల్లనూరు ఇన్‌ఛార్జి ఏడీ ఖాదర్‌బాషా, పశువైద్యాధికారి నాగ సువర్ణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

**నార్పల :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్సులు, విఆర్ఒలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## ఎదురెదురుగా ఢీకొన్న బస్సులు

### ఒకరి మృతి, పదిమందికి గాయాలు

**డి.హీరేహాల్ :** కర్నాటకు చెందిన రెండు ఆర్‌టిసి బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరో పది మందికి గాయాలైన సంఘటన డి.హీరేహాల్ మండల కేంద్రంలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణారెడ్డి వివరాల మేరకు.. బళ్లారి నుండి బెంగళూరు వైపు వెళ్తున్న కెఎస్ఆర్‌టిసి బస్సు, ఎదురుగా వస్తున్న మరో కెఎస్ఆర్‌టిసి బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సంకల్ప సిద్ధిమార్ట్ బాధితుల ఆందోళన

**కళ్యాణదుర్గం :** సంకల్ప సిద్ధి మార్ట్‌లో నగదు డిపాజిట్ చేసిన బాధితులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఓ ఉపాధ్యాయుడి ఇంటి వద్ద పలువురు బాధితులు నిరసన తెలిపారు. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన వెంకటేశులు అనే ఉపాధ్యాయుడి ఇంటివద్ద బాధితులు బైఠాయించి ఆందోళన చేశారు. పేదలను నమ్మించి లక్షలాది రూపాయాలు డిపాజిట్ చేయించి మోసం చేశారని మండిపడ్డారు. తాము చెల్లించిన నగదు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రి విశ్రాంత ఉద్యోగి మృతి

**గుత్తి :** ప్రభుత్వ ఆసుపత్రి విశ్రాంత ఉద్యోగి బీసీ కొండన్న (70) సోమవారం మృతి చెందారు. మూడు రోజుల క్రితం రహదారి వెంట వెళ్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి అనంతరం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నయం కాకపోవడంతో అతన్ని గుత్తికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో ఆయన మరణించారు. కొండన్న భౌతిక కాయాన్ని వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, నాయకులు బి.రమేష్‌రెడ్డి, పాత్రికేయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.గోవిందరాజులు, జి.మస్తానప్ప, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ తోపాటు పలువురు సందర్శించారు.

## వైసిపి అరాచకాలతో రాష్ట్రం నాశనం

**కళ్యాణదుర్గం :** వైసిపి అరాచకాలతో రాష్ట్రం భ్రష్టు పట్టిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి దుయ్యబట్టారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో పట్టణ కన్వీనర్ శర్మాస్ అధ్యక్షతన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు చౌళం మల్లికార్జున, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, పాపంపల్లి రామాంజనేయులు, ఆర్జీ శివశంకర్‌లతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైసిపి పాలనలో ప్రజలకు కీడుతప్ప మేలు జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. నవరత్నాల ఆశచూపి ప్రజలను ఊబికిలోకి నెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దౌర్భాగ్య ప్రభుత్వానికి నూకలుజల్లే సమయం దగ్గరపడిందన్నారు.

**తిమ్మసముద్రంలో..**

తిమ్మసముద్రం గ్రామంలో కన్వీనర్ గోళ్ల వెంకటేశులు ఆధ్వర్యంలో ఇదేంఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదేం ఖర్మ పోస్టర్లతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి వైసిపి వైఫల్యాలను ఎండగట్టారు. కార్యక్రమంలో మారుతిచౌదరి, దండా వెంకటేశులు, ఊటంకి రామాంజనేయులు, గౌని శ్రీనివాసరెడ్డి, కొల్లాపురప్ప, డీకే రామాంజనేయులు, శీన, ఒంటిమిద్ది సత్తి, తిమ్మరాజులు, మల్లిపల్లి నారాయణ, చిక్కన్న, రాయపాటి రామాంజనేయులు, మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'గడప గడపకూ మన ప్రభుత్వం'

**కళ్యాణదుర్గం :** సీఎం జగన్‌పాలనలో ఇంటింటికీ సంక్షేమం అందుతోందని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి ఉషా శ్రీచరణ్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని దేవాదులకొండ, కురాకులతోట గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. పథకాల అమలుతీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఫణీంద్ర, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన విప్ కాపు


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాపు

**కణేకల్లు :** కణేకల్లు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఆయనతోపాటు యువనేత కాపు ప్రవీణ్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు చామలూరు రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కణేకల్లు పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభసూచకమని అన్నారు. విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన యువనేత కాపు ప్రవీణ్‌రెడ్డికి అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘన స్వాగతం పలికారు. రాయదుర్గం పట్టణంలో కూడా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందామని విప్ కాపు తెలిపారు. జెడ్పిటిసి పద్మావతి, ఎంపీపీ సంధ్య డాక్టర్ సోమన్న, కనేకల్ టౌన్ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మాజీ రాయదుర్గం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఉషారాణి, మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, మారంపల్లి మారెన్న, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలచెర్ల హంపి, మండల అధ్యక్షుడు ఆలూరు గంగాధర్, లింగప్ప, రామాంజి, సురేష్, గోపి, జయప్రకాష్, ఎర్రిస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమాజంపై బాధ్యత వహించాలి

**రాయదుర్గం రూరల్ :** విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేటీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి సూచించారు. మండల పరిధిలోని 74 ఉడేగోళం గ్రామంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ప్రారంభం సందర్భంగా పలువురు మాట్లాడారు. గ్రామంలో ఏడు రోజుల పాటు నిర్వహించే శిబిరంలో విద్యార్థులు గ్రామస్తులతో మమేకం కావాలన్నారు. క్రమశిక్షణతో పనిచేసే గ్రామస్తుల్లో మంచి అభిప్రాయాన్ని కలిగించేలా నడుచుకోవాలన్నారు. సర్పంచి దుర్గమ్మ, పంచాయతీ కార్యదర్శి వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవర్ధన్, నారాయణ, వాలంటీర్లు పాల్గొన్నారు.